సాక్షి
యాదాద్రి భువనగిరి
శుక్రవారం। 13। సెప్టెంబర్। 2024



చోరీ కేసులో నిందితుడి అరెస్టు

నిడమనూరు మండలం ముకుందాపురంలో ఓ ఇంట్లో దొంగతనం చేసిన నిందితుడిని పోలీసులు అరెస్టు చేశారు. - 8లో



సేంద్రియ వ్యవసాయం చేయాలి

రైతులు సేంద్రియ చేయాలని మండ్సూర్ వ్యవసాయ విశ్వవిద్యాలయ విద్యార్థులు అన్నారు. - 8లో



విరిగిపడితే అంతే సంగతులు

ఆలేరులోని హైదరాబాద్ - వరంగల్ హైవే వెంట ఉన్న వృక్షాలు ఎండిపోయి ప్రమాదకరంగా మారాయి. - 9లో

న్యూస్‌రీల్

ఆరోగ్య కేంద్రంలో వైద్య సేవలు మెరుగుపరచాలి



రికార్డులు తనిఖీ చేస్తున్న జిల్లా వైద్యాధికారి

మోటకొండూర్: సీజనల్ వ్యాధులు ప్రబలకుండా మోటకొండూర్ మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్య సేవలు మెరుగుపరచాలని జిల్లా వైద్యాధికారి యశోధ సూచించారు. గురువారం మండల కేంద్రంలోని ఆరోగ్య కేంద్రాన్ని ఆమె సందర్శించి వైద్యులతో మాట్లాడారు. ఈ సందర్భంగా సిబ్బంది హాజరు రిజిస్టర్ పరిశీలించారు. పేషెంట్లకు అందుతున్న సేవల గురించి అడిగి తెలుసుకున్నారు. ఆమె వెంట వాణి, విజయ్, నర్సింహ, సునీత తదితరులున్నారు.

మూసీ ప్రక్షాళన అవగాహన సదస్సు వాయిదా

భూదాన్‌పోచంపల్లి: సీపీఎం జాతీయ ప్రధాన కార్యదర్శి ఏచూరి సీతారాం మృతి చెందడంతో పోచంపల్లి పట్టణంలో శుక్రవారం నిర్వహించనున్న మూసీ ప్రక్షాళన, గోదావరి కృష్ణా జలాల అవగాహన సదస్సు వాయిదా వేసినట్లు మూసీ ప్రక్షాళన, గోదావరి కృష్ణాజలాల సాధన కమిటీ జిల్లా కోకన్వీనర్ కోట రాంచంద్రారెడ్డి గురువారం తెలిపారు. అదేవిధంగా ఏచూరి సీతారాం మృతికి ఆయన సంతాపం తెలిపారు.

'అజీవ' సేవలు అభినందనీయం



మాట్లాడుతున్న వినయ్ కుమార్

యాదగిరిగుట్ట రూరల్: రైతులకు అజీవ సంస్థ అందిస్తున్న సేవలు అభినందనీయమని నాబార్డు డీడీఎం (డిస్ట్రిక్ డిపార్ట్‌మెంట్ మేనేజర్) వినయ్‌కుమార్ అన్నారు. గురువారం యాదగిరిగుట్ట మండలంలోని చొల్లేరు గ్రామంలో అజీవ రైతు ఉత్పత్తి దారుల సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడారు. గత 7 సంవత్సరాలుగా అజీవ సంస్థ నుంచి రైతులకు సేవలు అందుతున్నాయన్నారు. గ్రామీణ జీవన సాగులు, పాడి పరిశ్రమలో మెలకువలపై చొల్లేరు, మల్లిగూడెం, మహబూబ్‌పేట, సాధువెల్లి గ్రామాల మహిళలు శిక్షణ విజయవంతంగా పూర్తి చేయడం సంతోషకరమన్నారు. కార్యక్రమంలో గ్రామీణ వికాస బ్యాంకు రీజనల్ మేనేజర్, పీస్ సంస్థ డైరెక్టర్ నిమ్మయ్య, అజీవ చైర్‌పర్సన్ ఎల్లుబాయి, సెక్రటరీ స్వరూప, కొక్కలకొండ అరుణ, సీఈఓ మహేష్ పాల్గొన్నారు.

జెండా ఆవిష్కరించేందుకు విప్‌కు అవకాశమివ్వాలి



మాట్లాడుతున్న గోద శ్రీరాములు

యాదగిరిగుట్ట: కలెక్టరేట్‌లో 17వ తేదీన ప్రజాపాలన దినోత్సవం సందర్భంగా జాతీయ జెండా ఆవిష్కరించేందుకు ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్యకు అవకాశం కల్పించాలని సీపీఐ జిల్లా కార్యదర్శి గోద శ్రీరాములు కోరారు. గురువారం యాదగిరిగుట్ట పట్టణంలోని సీపీఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కలెక్టరేట్‌లో జెండా ఆవిష్కరించేందుకు శాసన మండలి చైర్మన్ సుఖేందర్‌రెడ్డికి శాసన మండలిలో కాని, ఇతర జిల్లాలో కానీ అవకాశామిచ్చి, ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్యకు జిల్లా కలెక్టరేట్‌లో జెండా ఎగురవేసేందుకు అవకాశం ఇవ్వాలన్నారు. సమావేశంలో జిల్లా కార్యవర్గ సభ్యులు కల్లెం కృష్ణ, బండి జంగమ్మ, జిల్లా సమితి సభ్యులు బబ్బూరి శ్రీధర్, మండల కార్యదర్శి కల్లెపల్లి మహేందర్, సహాయ కార్యదర్శి పేరబోయిన మహేందర్, మున్సిపల్ కో ఆప్షన్ సభ్యులు పేరబోయిన పెంటయ్య, మండల కార్యవర్గ సభ్యులు గోపగాని రాజు, ఆరె పుష్ప ఉన్నారు.

టూర్ గైడ్ల శిక్షణకు ఆహ్వానం

నాగార్జునసాగర్: సాగర్ తీరంలో నిర్మించిన బుద్ధిస్ట్ థీమ్‌పార్కులో అక్టోబర్‌లో వారం రోజుల పాటు టూర్‌గైడ్ల శిక్షణ శిబిరాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు పర్యాటక అభివృద్ధి సంస్థ మేనేజింగ్ డైరెక్టర్, బుద్ధవనం ప్రత్యేకాధికారి ప్రకాశ్‌రెడ్డి గురువారం తెలిపారు. శిక్షణ శిబిరంలో పాల్గొనే ఆసక్తి గల స్థానిక రిటైర్డ్ ఉపాధ్యాయులు, ఉద్యోగులు, నిరుద్యోగ యువతీ, యువకులు 15వ తేదీలోపు తమ దరఖాస్తులను సమర్పించాలని సూచించారు.



ఢిల్లీలో పుట్టపాక ఇక్కత్ స్టాల్

సంస్థాన్ నారాయణపురం: నేషనల్ ఫిక్కీ ఫ్లో ఆధ్వర్యంలో ఢిల్లీలో నిర్వహించిన ఎగ్జిబిషన్‌లో పుట్టపాక ఉమెన్స్ హ్యాండ్లూమ్స్ ఇక్కత్ ప్రొడక్ట్స్ సొసైటీ వారు స్టాల్ ఏర్పాటు చేశారు. ఈ స్టాల్‌ను ఫిక్కీ ఫ్లో సభ్యురాలు మ్రినాలనిశాస్త్రి గురువారం సందర్శించారు. ఆమె వెంట మాజీ సర్పంచ్ సామల భాస్కర్, సొసైటీ అధ్యక్షురాలు విజయలక్ష్మి తదితరులు ఉన్నారు.

స్టాల్‌ను సందర్శించిన ఫిక్కీ ఫ్లో సభ్యురాలు మ్రినాలనిశాస్త్రి తదితరులు

పంచముఖ వినాయకుడికి కుంకుమార్చన



చౌటుప్పల్ పట్టణ కేంద్రంలోని విద్యానగర్‌కాలనీలో ప్రతిష్ఠించిన వినాయక విగ్రహం వద్ద గురువారం నిర్వహించిన పూజల్లో పాల్గొన్న మహిళలు - చౌటుప్పల్

నేడే 'డెయిరీ' ఎన్నిక

- మదర్ డెయిరీలో ఆరుగురు డైరెక్టర్లను ఎన్నుకోనున్న పాల సొసైటీ చైర్మన్లు
- పోలింగ్‌కు ఏర్పాట్లు పూర్తిచేసిన అధికారులు
- కాంగ్రెస్ క్యాంపులో 200 మంది ఓటర్లు
- క్యాంపును సందర్శించిన మంత్రి కోమటిరెడ్డి, ఎమ్మెల్యేలు
- గెలుపు కోసం బీఆర్ఎస్ ప్రయత్నాలు



క్యాంపును సందర్శించిన మంత్రి కోమటిరెడ్డి

సాక్షి, యాదాద్రి: నల్లగొండ-రంగారెడ్డి పాల ఉత్పత్తిదారుల పరస్పర సహాయ సహకార సమితి లిమిటెడ్(మదర్ డెయిరీ)లో ఖాళీగా ఉన్న ఆరు డైరెక్టర్ పదవుల ఎన్నికకు శుక్రవారం పోలింగ్ జరుగనుంది. రంగారెడ్డి జిల్లా హయత్ నగర్‌లోని ఆర్టీసీ కాలనీలో గల ఎస్.వీ కన్వెన్షన్‌లో ఓటింగ్ కోసం అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు పోలింగ్ జరుగుతుంది. ప్రస్తుతం పదవిలో 9 మంది డైరెక్టర్లు ఉన్నారు. ఖాళీగా ఉన్న ఆరు డైరెక్టర్ స్థానాలకు 12 మంది పోటీపడుతున్నారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు ఈ ఎన్నికను ప్రతిష్టాత్మకంగా తీసుకున్నాయి. ఓటింగ్‌లో పాల్గొనే పాల సొసైటీల చైర్మన్లతో కాంగ్రెస్ పార్టీ మూడు రోజులుగా క్యాంపు నిర్వహిస్తోంది. బీఆర్ఎస్ పార్టీ సైతం పోటీలో ఉన్న తమ అభ్యర్థులను గెలిపించుకునేందుకు చెమటోడుస్తోంది.

ఆరు స్థానాలకు ఎన్నిక

మదర్ డెయిరీలో ఖాళీ అయిన ఆరుగురు పాలకవర్గ సభ్యుల ఓటింగ్ కోసం ఎన్నికల అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. ఈ ఎన్నికలో 297 మంది పాల సొసైటీ చైర్మన్లు ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. ఉమ్మడి నల్లగొండ జిల్లాలోని నాలుగు డైరెక్టర్లకు 8 మంది, రంగారెడ్డి జిల్లాలోని రెండు డైరెక్టర్ల స్థానాలకు నలుగురు పోటీలో ఉన్నారు. నల్లగొండలోని నాలుగు డైరక్టర్ల స్థానాలకు ఆలేరు నియోజవకర్గం నుంచి 8 మంది పోటీపడుతున్నారు. వీరిలో కాంగ్రెస్, బీఆర్ఎస్‌ల నుంచి చెరో నలుగురు ఉన్నారు. రంగారెడ్డి జిల్లాకు రిజర్వు చేసిన రెండు స్థానాలకు కాంగ్రెస్ అభ్యర్థులే నలుగురు పోటీపడుతున్నారు.

గెలిపించాలని కోరిన మంత్రి కోమటిరెడ్డి

రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం శివారు బొంగుళూరులోని ఓ ఫంక్షన్‌హాల్‌లో క్యాంపులో ఉన్న సుమారు 200 మంది పాలసొసైటీ చైర్మన్లకు శుక్రవారం మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, జిల్లాకు చెందిన ఎమ్మెల్యేలు దిశానిర్దేశం చేశారు. తమ పార్టీ బలపర్చిన అభ్యర్థులను గెలిపించాలని కోరారు. మంత్రితో పాటు ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య, ఎమ్మెల్యేలు కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి, వేముల వీరేశం, మందుల సామేల్ సందర్శించారు. పాల చైర్మన్లు అంతా క్యాంపు నుంచి నేరుగా పోలింగ్ కేంద్రానికి చేరుకునేందుకు ప్రత్యేకంగా ఏర్పాట్లు చేశారు.

గెలుపుపై బీఆర్ఎస్ ధీమా

తమ పార్టీ అభ్యర్థులు విజయం సాధిస్తారని బీఆర్ఎస్ ధీమాతో ఉంది. నలుగురు అభ్యర్థులను పోటీకి దించిన బీఆర్ఎస్ పార్టీ.. పాల సొసైటీ చైర్మన్లతో టచ్‌లో ఉంది. డీసీసీబీ మాజీ అధ్యక్షుడు గొంగిడి మహేందర్‌రెడ్డి ప్రతి చైర్మన్‌కు ఫోన్ చేసి తమ అభ్యర్థులను గెలిపించాలని కోరుతున్నారు.

పోటీలో ఉన్నది వీరే

ఉమ్మడి నల్లగొండ జిల్లా నుంచి పోటీలో ఎనిమిది మంది ఉన్నారు. కాంగ్రెస్ నుంచి గుడిపాటి మధుసూదన్‌రెడ్డి, పుప్పాల నర్సింహులు, బత్తుల నరేందర్‌రెడ్డి, కల్లెపల్లి శ్రీశైలం ఉన్నారు. బీఆర్ఎస్ నుంచి సందిల భాస్కర్, ఎం.కొండల్‌రెడ్డి, ఒగ్గు బిక్షపతి, డి.సామిరెడ్డి బరిలో నిలిచారు. రంగారెడ్డి జిల్లాలో ఎ.నర్సింహారెడ్డి, ఎం. జంగయ్య, ఎ.రాంరెడ్డి, పి.గణేష్ పోటీలో ఉన్నారు.

పోలింగ్ పూర్తయిన వెంటనే కౌంటింగ్

శుక్రవారం ఉదయం ఎనిమిది గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు పోలింగ్ జరుగనుంది. 297 మంది ఓటర్లు తమ ఓటు హక్కు వినియోగించుకోనున్నారు. పోలింగ్ పూర్తయిన తర్వాత మధ్యాహ్నం 2 గంటల నుంచి కౌంటింగ్ ప్రారంభం అవుతుంది. ఓట్ల లెక్కింపు ముగిసిన వెంటనే గెలుపొందిన డైరక్టర్ల పేర్లు ప్రకటిస్తారు. పోటీలో ఉన్న 12మంది అభ్యర్థుల్లో ఎక్కువ ఓట్లు వచ్చిన నలుగురిని డైరక్టర్లుగా ప్రకటిస్తారు. నల్లగొండ జిల్లాలో నలుగురిని, రంగారెడ్డి జిల్లాలో ఇద్దరిని ఎన్నికైనట్లు ప్రకటిస్తారు. గెలిచిన ఆరుగురు డైరెక్టర్ల పదవీకాలం లాటరీ పద్ధతిలో నిర్ణయిస్తారు. 14వ తేదీన డైరెక్టర్లు అందరు కలిసి నూతన చైర్మన్‌ను ఎన్నుకుంటారు.

ప్రజాపాలన దినోత్సవానికి ఏర్పాట్లు చేయాలి

- కలెక్టర్ హనుమంతు కె. జెండగే



మాట్లాడుతున్న కలెక్టర్ హనుమంతు కె. జెండగే

సాక్షి,యాదాద్రి: కలెక్టరేట్‌లో ఈనెల 17న నిర్వహించనున్న తెలంగాణ ప్రజాపాలన దినోత్సవానికి పక్కాగా ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ హనుమంతు కె.జెండగే అధికారులను ఆదేశించారు. ఈమేరకు గురువారం సంబంధిత శాఖల అధికారులతో ఆయన కలెక్టరేట్‌లో సమీక్షించారు. ఉదయం 10 గంటలకు శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి జాతీయ జెండా ఆవిష్కరిస్తారని తెలిపారు. సంబంధిత అన్ని శాఖలు సమన్వయంతో ఏర్పాట్లు నిర్వహించాలని సూచించారు. కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ గంగాధర్, అడిషనల్ డీసీపీ లక్ష్మీనారాయణ, భువనగిరి రెవెన్యూ డివిజనల్ అధికారి అమరేందర్, ఏసీపీ రవికిరణ్‌రెడ్డి, జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి నాగిరెడ్డి, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

గుండాల: గుండాల మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని కలెక్టర్ హనుమంతు కె.జెండగే గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. చికిత్స పొందుతున్న జ్వర పీడితులతో మాట్లాడి, ఫార్మసీలోని మందులు పరిశీలించారు. సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాని వైద్యాధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా ఆయన రోగులతో మాట్లాడుతూ.. ఆరోగ్య పరీక్షలు చేస్తున్నారా? మందులు ఇస్తున్నారా? అని అడిగి తెలుసుకున్నారు. అవసరమైన మందుల కోసం ప్రభుత్వానికి నివేదిక పంపించి మందులను తెప్పించుకొని బాధితులకు అందించాలని వైద్యసిబ్బందికి సూచించారు. అదే విధంగా అనంతారం గ్రామంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు నిర్వహిస్తున్న రక్త పరీక్షల శిబిరాన్ని పరిశీలించారు. అనంతరం కొమ్మాయిపల్లి గ్రామంలోని ప్రాథమిక ఆరోగ్య ఉప కేంద్రాన్ని తనిఖీ చేశారు. అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించి బాలింతలు, గర్భిణులకు అందజేస్తున్న పౌష్టికాహారంపై ఆరా తీశారు. దేవాదుల కాల్వ కోసం తీసుకున్న భూమి ఆన్‌లైన్‌లో రెండుసార్లు తొలగించబడిన రైతుల దరఖాస్తులను పరిష్కరించాలని తహసీల్దార్ జలకుమారిని ఆదేశించారు. లావని పట్టా పొందిన వారికి బ్యాంకుల్లో రుణాలు ఇవ్వడం లేదని కొంత మంది రైతులు కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లగా బ్యాంకర్లతో మాట్లాడి రైతులకు రుణాలు ఇప్పిస్తామని హామీ ఇచ్చారు. గతంలో రుణం పొందిన రైతుల భూమి లావని పట్టా అయినా రుణమాఫీ వచ్చిన వారికి కచ్చితంగా తిరిగి రుణం ఇవ్వాలని బ్యాంకర్లకు సూచించారు. కలెక్టర్ వెంట వైద్యాధికారులు డాక్టర్ హైమావతి, డాక్టర్ యూనుస్, వైద్య సిబ్బంది, అంగన్‌వాడీ సిబ్బంది ఉన్నారు.

గణనాథుడి శోభాయాత్రకు పటిష్ట బందోబస్తు




నిమజ్జన ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఏసీపీ

భువనగిరి క్రైం: భువనగిరి పట్టణంలో ఈనెల 16న గణేష్ శోభాయాత్ర నేపథ్యంలో ఏసీపీ రవికిరణ్‌రెడ్డి గురువారం ప్రిన్స్ చౌరస్తా, జగదేవ్‌పూర్ చౌరస్తా, హైదరాబాద్ ఎక్స్‌రోడ్డు, జలీల్‌పుర సమ్మద్ చౌరస్తా, శంకర్ విలాస్, కుమ్మరివాడ, ఆజాద్‌రోడ్డు తదితర ప్రాంతాలను సందర్శించారు. ఈ సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ఆయన వెంట పట్టణ ఇన్‌స్పెక్టర్ సురేష్ కుమార్, మున్సిపల్ చైర్మన్ పోత్తంశెట్టి వెంకటేశ్వర్లు, ఉత్సవ కమిటీ అధ్యక్షుడు రత్నపురం శ్రీశైలం, దేవరకొండ నర్సింహచారి, చిట్టల బాల్‌రాజు, మున్సిపల్ కమిషనర్ రామాంజనేయులు రెడ్డి తదితరులున్నారు.

డెంగీ పేరుతో దోపిడీ!

వలిగొండ మండల కేంద్రానికి చెందిన ఓ వ్యక్తి గత నెలలో జ్వరం బారిన పడ్డాడు. స్థానికంగా ఉన్న ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందాడు. అప్పటికీ జ్వరం తగ్గకపోవడంతో జిల్లా కేంద్ర ఆస్పత్రికి వెళ్లాడు. అతడికి డెంగీ లక్షణాలు కనిపించడంతో పరీక్షించగా డెంగీ పాజిటివ్‌గా నమోదైంది. అప్పటికే ప్లేట్‌లెట్స్ తగ్గడంతో వైద్యులు సికింద్రాబాద్‌లోని గాంధీ ఆస్పత్రికి రీఫర్ చేశారు. కుటుంబ సభ్యులు అతడిని గాంధీ ఆస్పత్రికి కాకుండా హైదరాబాద్‌లోని ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకెళ్లారు. డెంగీ నిర్ధారణ కావడంతో అడ్మిట్ చేసుకుని మూడు, నాలుగు రోజుల పాటు ఆస్పత్రిలో చికిత్స అందించారు. ఆ ఆస్పత్రిలో పరీక్షలు, చికిత్స నిమిత్తం అతడు మొత్తం సుమారు 1.50లక్షలు ఖర్చు చేశాడు.

- డెంగీ నిర్ధారణకు టీ హబ్‌కు పంపాలని వైద్య ఆరోగ్య శాఖ సూచన
- వీటిని బేఖాతరు చేస్తూ సొంత ల్యాబ్‌లో పరీక్షలు చేస్తున్న ప్రైవేట్ ఆస్పత్రులు
- ప్లేట్‌లెట్స్ తగ్గాయని చికిత్స పేరుతో రూ.వేలల్లో వసూలు
- జిల్లాలో ఇప్పటివరకు అధికారికంగా 122 డెంగీ కేసులు నమోదు



భువనగిరి: జిల్లాలో ప్రైవేట్ ఆస్పత్రుల్లో డెంగీ చికిత్స పేరుతో దోపిడీ కొనసాగుతోంది. ప్రస్తుతం డెంగీ విజృంభిస్తుండడం, ఇప్పటికే జిల్లాలో ఒకరు డెంగీతో మృతి చెందడంతో సాధారణ వైరల్ ఫీవర్లు వచ్చిన జనం హడలిపోతున్నారు. అయితే వారి భయాన్ని ఆసరాగా చేసుకుని ప్రైవేట్ ఆస్పత్రులు, డయాగ్నోస్టిక్ సెంటర్ల నిర్వాహకులు చికిత్స పేరుతో వేల రూపాయలు వసూలు చేస్తున్నారు. ఎలాంటి అనుమతులు లేని ల్యాబ్‌లలో సైతం పరీక్షలు చేసి డెంగీగా నిర్ధారణ చేస్తున్నారు. ఇలాంటి తరహా దందా జిల్లా కేంద్రంతో పాటు చౌటుప్పల్ డివిజన్ కేంద్రంలో అధికంగా కొనసాగుతోంది. జనవరి నుంచి ఇప్పటి వరకు జిల్లాలో అధికారికంగా 122 డెంగీ కేసులు నమోదయ్యాయి. అనధికారికంగా ప్రైవేట్ ఆస్పత్రుల్లో డెంగీ పరీక్షలు నిర్వహించి పాజిటివ్ వచ్చిన వారికి వైద్య ఆరోగ్యశాఖ అధికారులకు చెప్పకుండా చికిత్స అందిస్తున్నారు.

ప్రభుత్వ సూచనలు పాటించని ప్రైవేట్ ఆస్పత్రులు

సాధారణంగా ప్రైవేట్ ఆస్పత్రులకు గాని ల్యాబ్‌లకు గాని డెంగీ నిర్ధారణ పరీక్షలు నిర్వహించే అధికారం లేదు. ఈ విషయంపై ఇటీవల ప్రైవేట్ ఆస్పత్రుల నిర్వాహకులతో సమావేశం ఏర్పాటు చేసి జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారులు సూచనలు చేశారు. డెంగీ లక్షణాలు కనిపిస్తే టీ హబ్‌కు రక్త నమూనాలు పంపి అక్కడ నిర్ధారణ చేయాలనే నిబంధనలు ఎక్కడా పాటించడం లేదు.

ప్రైవేట్ డయాగ్నోస్టిక్ సెంటర్లలో డెంగీ పరీక్షలు చేయొద్దు



సాధారణంగా వైరల్ ఫీవర్స్, చికున్‌గున్యా వచ్చినా ప్లేట్‌లెట్స్ తగ్గుతుంటాయి. ప్రతి వ్యక్తి శరీరంలో సాధారణంగా లక్ష నుంచి 3 లక్షల వరకు ప్లేట్‌లెట్స్ ఉంటాయి. ఆయా సమస్యలు వచ్చినప్పుడు ప్లేట్‌లెట్స్ తగ్గినా ప్రాణానికి హాని కలిగేంత ప్రమాదం ఉండదు. 10 నుంచి 20 వేలకు ప్లేట్‌లెట్స్ తగ్గినప్పుడే ప్రమాదం ఉంటుంది. ప్రైవేట్ ఆస్పత్రులకు డెంగీ లక్షణాలు ఉన్న వారు వస్తే వారి రక్త నమూనాలను టీ హబ్‌కు పంపించాలి. అలా కాకుండా ప్రైవేట్ ఆస్పత్రుల్లోనే పరీక్షలు చేస్తే అలాంటి నిర్వాహకులపై చర్యలు తీసుకుంటాం.

– డాక్టర్ యశోధ, ఇన్‌చార్జ్ డీఎంహెచ్‌ఓ

ప్లేట్‌లెట్స్ తగ్గాయని..

వైరల్ ఫీవర్‌తో ప్రైవేట్ ఆస్పత్రులకు వచ్చిన రోగులకు ప్లేట్‌లెట్స్ తగ్గాయంటూ డెంగీ చికిత్సనే అందిస్తున్నారు. ప్రజలకు డెంగీ వ్యాధిపై అవగాహన లేకపోవడంతో ప్రైవేట్ ఆస్పత్రులు, డయాగ్నోస్టిక్ సెంటర్లతో కుమ్మక్కై చిన్నపాటి జ్వరానికి సైతం పరీక్షలు చేయిస్తూ రూ.40 వేల నుంచి రూ.లక్ష వరకు వసూలు చేస్తూ ప్రజలను దోచుకుంటున్నారు.

యాదాద్రిలో సంప్రదాయ పూజలు



నిత్యకల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

యాదగిరిగుట్ట: యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి వారి ఆలయంలో గురువారం సంప్రదాయ పూజలు వైభవంగా నిర్వహించారు. వేకువజామునే ఆలయాన్ని తెరిచిన అర్చకులు శ్రీస్వామి అమ్మవార్లకు సుప్రభాతం జరిపించారు. అనంతరం స్వయంభూ, ప్రతిష్ఠా అలంకారమూర్తులకు నిజాభిషేకం, తులసీ దళాలతో అర్చన చేపట్టారు. ఆలయ ప్రథమ ప్రాకార మండపంలో గజవాహన సేవ, నిత్య కల్యాణం, బ్రహ్మోత్సవం వంటి కైంకర్యాలను నిర్వహించారు. సాయంత్రం వేళ వెండి జోడు సేవలను మాడవీధిలో ఊరేగించారు. వివిధ పూజల్లో భక్తులు పాల్గొని మొక్కులు చెల్లించుకున్నారు.

సీతారాం ఏచూరికి నివాళి



భువనగిరిలో సీపీఎం జాతీయ ప్రధాన కార్యదర్శి ఏచూరి సీతారాం చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు

డైట్ బిల్లులు వస్తలేవు

- ఎస్సీ, బీసీ, మైనార్టీ వసతి గృహాలకు భోజనం సరఫరా చేస్తున్న కాంట్రాక్టర్లకు అందని బిల్లులు
- ఆరు నెలలుగా సమారు రూ.2.60కోట్లు పెండింగ్
- విద్యార్థులకు అందే భోజన నాణ్యతపై ప్రభావం



సాక్షి, యాదాద్రి: ఆరునెలలుగా ప్రభుత్వం నుంచి డైట్ బిల్లులు మంజూరు కావడంలేదు. దీంతో ఎస్సీ, బీసీ, మైనార్టీ శాఖల వసతి గృహాలకు డైట్ సరఫరా చేసే కాంట్రాక్టర్లు సరుకులు సరఫరా చేయలేమని చేతులెత్తే పరిస్థితి నెలకొంది. క్యాటరింగ్, కూరగాయలు, పండ్లు, చికెన్, మటన్, కిరాణం సరుకుల బిల్లులు కాంట్రాక్టర్లకు మార్చి నుంచి ఇవ్వడం లేదు. అయితే కొందరు కాంట్రాక్టర్లు బిల్లులు రావడం లేదని సరుకుల సరఫరాను తగ్గిస్తున్నారు. ప్రభుత్వం డైట్ బిల్లులను వెంటనే మంజూరు చేయాలని, లేదంటే సరుకుల సరఫరా పూర్తిగా నిలిపివేస్తామని కొందరు కాంట్రాక్టర్లు పేర్కొంటున్నారు.

మొత్తం 14,800 మంది విద్యార్థులు

ఎస్సీ, బీసీ, మైనార్టీ శాఖల వసతి గృహాల్లో వేలాది మంది విద్యార్థులు చదువుతున్నారు. ఇందులో 8 సాంఘిక సంక్షేమ గురుకులాల్లో సుమారు 5వేల మంది విద్యార్థులు, 19 వసతి గృహాల్లో 1000 మంది, ఆరు మహాత్మా జ్యోతిరావు పూలే గురుకులాల్లో 4500 మంది, బీసీ వసతి గృహాలు, కళాశాల వసతి గృహాల్లో 600 మంది, మూడు మైనార్టీ గురుకులాల్లో 800 మంది, 8 కేజీబీవీల్లో 2,500 మంది, 5 మోడల్ స్కూళ్లలో 400 మంది వరకు విద్యనభ్యసిస్తున్నారు. ఇంటర్ వరకు విద్యార్థికి రోజుకు రూ.35, నెలకు రూ.1050 చొప్పున ప్రభుత్వం బిల్లులు చెల్లిస్తుంది. మొత్తంగా 14,800 మంది విద్యార్థులకు గాను ఆరు నెలలకు సంబంధించి సుమారుగా రూ.2.60కోట్లకు పైగా బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి. కాంట్రాక్టర్లు టెండర్ ప్రకారం క్రమం తప్పకుండా సరుకులు సరఫరా చేయాల్సి ఉంది. దీంతో బంగారం, ఆస్తులు తాకట్టు పెట్టి వడ్డీకి అప్పు తెస్తున్నారు. నెలనెలా రావాల్సిన బిల్లులు ఆరు నెలలుగా రాకపోవడంతో ఇబ్బందులు పడుతున్నామని కాంట్రాక్టర్లు పేర్కొంటున్నారు.

మెనూ ప్రకారం ఇలా..

సాంఘిక సంక్షేమ, కేజీబీవీ, మహాత్మా జ్యోతిబాపూలే, బీసీ గురుకుల వసతి గృహాల్లో విద్యార్థులకు నెలలో నాలుగు వారాలు చికెన్, ప్రతిరోజు కోడిగుడ్డు, నెలకు ఒకసారి మటన్‌తో భోజనం పెట్టాలి. అదే విధంగా ప్రతిరోజు బ్రేక్ ఫాస్ట్ (ఇడ్లీ, పూరీ, చపాతి, బోండా) రోజుకొక వెరైటీ చొప్పున అందించాలి. కానీ నెలనెలా బిల్లులు విడుదల కాకపోవడంతో విద్యార్థులకు పూర్తి స్థాయిలో బ్రేక్‌పాస్ట్ అందడం లేదు. కేవలం ఇడ్లీ, చపాతితోనే సరిపెడుతున్నారు. చికెన్ పెట్టడం కూడా తగ్గించారు.

నిధులు రాగానే బిల్లులు చెల్లిస్తాం

ఈ విద్యా సంవత్సరానికి సంబంధించి డైట్ చార్జీలు పెండింగ్‌లో ఉన్నాయి. ప్రభుత్వం నిధులు మంజూరు చేయగానే కాంట్రాక్టర్లకు బిల్లులు చెల్లిస్తాం. ఇప్పటివరకు ఎక్కడా డైట్ సరుకుల సరఫరా నిలిచిపోలేదు. మెనూ ప్రకారం భోజనం అందిస్తున్నాం.

– విద్యారాణి, సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల, కళాశాలల జోనల్ అధికారి

క్లుప్తంగా

బాలెంల రమేష్‌కు అవార్డు


అవార్డు అందుకుంటున్న రమేష్

అడ్డగూడూరు : మండల కేంద్రానికి చెందిన సుగతి ఫౌండేషన్ చైర్మన్ బాలెంల రమేష్‌కు గోల్డెన్ ఫ్యూచర్ గ్లోబల్ సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో అఖండ నంది అవార్డు లభించింది. సుగతి ఫౌండేషన్ ఆధ్వర్యంలో చేసిన సేవా కార్యక్రమాలకు గుర్తింపుగా హైదరాబాద్ గోల్డెన్ ఫ్యూచర్ గ్లోబల్ సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో పొట్టి శ్రీరాములు తెలుగు యూనివర్సిటీలో డాక్టర్ నందమూరి తారక రామారావు కళామందిర్‌లో నిర్వహించిన కార్యక్రమంలో అవార్డు అందుకున్నట్లు గురువారం రమేష్ తెలిపారు.

డీజిల్ చోరీ నిందితుల అరెస్ట్

బొమ్మలరామారం : మండలంలోని చీకటిమామిడి గ్రామంలో జరిగిన డీజిల్ చోరీ కేసులో నిందితులను గురువారం అరెస్ట్ చేసి కోర్టుకు రిమాండ్ చేసినట్లు ఎస్ఐ శ్రీశైలం తెలిపారు. ఎస్ఐ తెలిపిన వివరాల ప్రకారం.. బొమ్మలరామారం మండలంలోని చీకటిమామిడి గ్రామంలో నిలిపి ఉంచిన రెండు లారీల్లో డీజిల్ చోరీకి గురైందని బాధితులు బుధవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. దర్యాప్తు చేపట్టిన పోలీసులు చీకటిమామిడి గ్రామానికి చెందిన చిందం రాజు, జూపల్లి రాజయ్య, మహదేవుని సోమప్పలు చోరీకి పాల్పడినట్లు గుర్తించారు. ముగ్గురిని అరెస్ట్ చేసి రిమాండ్ చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

యువకుడు అదృశ్యం


గణేశ్

తిరుమలగిరి(నాగార్జున సాగర్) : యువకుడు అదృశ్యమైన ఘటన తిరుమలగిరి మండలంలో చోటుచేసుకుంది. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. తిరుమలగిరి మండలంలోని తూటిపేటతండాకు చెందిన ఆంగోతు గణేశ్ పది సంవత్సరాలుగా నల్లగొండ పట్టణంలో ప్రైవేట్ ఉద్యోగం చేస్తూ కుటుంబంతో కలిసి జీవనం సాగిస్తున్నాడు. వినాయక నిమజ్జనానికి తన స్వగ్రామమైన తూటిపేటతండాకు వెళ్తున్నానని బుధవారం మధ్యాహ్నం సమయంలో తన భార్యకు చెప్పి వెళ్లాడు. రాత్రి వరకు తన స్వగ్రామానికి చేరుకోకపోవడంతోపాటు ఫోన్ కూడా స్విచ్ ఆఫ్ వస్తోంది. బంధువుల ఇళ్లల్లో వెతికినా ఆచూకీ ఎక్కడా కనిపించడం లేదని కుటుంబ సభ్యులు తెలిపారు. గణేశ్ ఆచూకీ తెలిసినట్లయితే 7036489965, 8074951508 నంబర్లకు సమాచారం ఇవ్వాలని కుటుంబ సభ్యులు కోరారు. ఈ విషయమై పోలీసులకు ఫిర్యాదు అందలేదని తెలిసింది.

గాయపరిచిన వ్యక్తిపై కేసు

నార్కట్‌పల్లి : ఓ వ్యక్తిని కొట్టి గాయపరిచిన ఘటనలో కేసు నమోదైన ఘటన నార్కట్‌పల్లి మండలంలోని తొండల్‌వాయి గ్రామంలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. తొండల్‌వాయి గ్రామానికి చెందిన పోతల ఏసుదాసు ఈ నెల 1వ తేదీన చిట్యాల వెళ్లేందుకు నార్కట్‌పల్లి బస్టాండ్ వద్ద నిల్చున్నాడు. ఈ క్రమంలో అక్కెనపల్లి గ్రామానికి చెందిన మిడిదొడ్డి నాగరాజు తన కారుతో బస్టాండ్ వద్దకు వచ్చాడు. అక్కడున్న ఏసుదాసుకు లిఫ్ట్ ఇస్తా అని కారులో ఎక్కించుకుని కొద్దిదూరం వెళ్లాడు. అయితే తాను చర్చి పాస్టర్ అని తెలుసుకున్న నాగరాజు తాగిన మైకంతో తనతో గొడవపడి కొట్టి గాయపరిచాడని ఏసుదాసు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. విచారణ చేసి గురువారం నాగరాజును అరెస్టు చేసి కేసు నమోదు చేసి రిమాండ్‌కు పంపినట్లు ఎస్ఐ క్రాంతికుమార్ తెలిపారు.

అక్రమంగా మద్యం అమ్ముతున్న వ్యక్తిపై..

చౌటుప్పల్ రూరల్: అక్రమంగా మద్యం అమ్ముతున్న వ్యక్తిపై చౌటుప్పల్ పోలీసులు కేసు నమోదు చేశారు. సీఐ మన్మథకుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. చౌటుప్పల్ మండలంలోని తూప్రాన్‌పేట గ్రామానికి చెందిన చెంచల విష్ణు గ్రామంలో అక్రమంగా బెల్ట్ షాప్ నిర్వహిస్తూ మద్యం అమ్ముతున్నాడు. గురువారం షాప్‌లో తనిఖీ చేయగా 5 లీటర్ల మద్యం, బీర్లు దొరకడంతో కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

చోరీ కేసులో నిందితుడి అరెస్టు

- 10 తులాల బంగారం, 15 తులాల వెండి పట్టీలు, ద్విచక్రవాహనం, ఒక సెల్ ఫోన్ స్వాధీనం
- వివరాలు వెల్లడించిన మిర్యాలగూడ డీఎస్పీ రాజశేఖర రాజు


వివరాలు తెలియజేస్తున్న మిర్యాలగూడ డీఎస్పీ రాజశేఖర రాజు, హాలియా సీఐ జనార్దన్ గౌడ్

హాలియా : మద్యం, ఇతర వ్యసనాలకు అలవాటు పడి జల్సాలు చేసేందుకు డబ్బు కోసం ముకుందాపురంలోని ఓ ఇంట్లో దొంగతనం చేసిన నిందితుడిని పోలీసులు అరెస్టు చేశారు. నిందితుడి వద్ద నుంచి 10 తులాల బంగారం, 15 తులాల వెండి పట్టీలు, ఒక యమహా వాహనం, ఒక సెల్ ఫోన్ స్వాధీనం చేసుకున్నారు. మిర్యాలగూడ డీఎస్పీ రాజశేఖర రాజు గురువారం హాలియా సీఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కేసుకు సంబంధించిన వివరాలు వెల్లడించారు. నిడమనూరు మండలంలోని ముకుందాపురం గ్రామానికి చెందిన షేక్ ఉస్మాన్ తన ఇంట్లో జూలై 17న దొంగతనం జరిగిందని నిడమనూరు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. నిడమనూరు మండలంలోని ముకుందాపురం గ్రామానికి చెందిన నిందితుడు షేక్ అబ్దుల్ నబికి అతడి భార్యకు మధ్య ఏడాది కాలంగా గొడవలు జరుగుతున్నాయి. తన భార్య సంసారానికి రాకుండా విడిగా ఉండడంతో షేక్ అబ్దుల్ నబి హైదరాబాద్‌లో ఉంటూ సుతారి పని చేసుకుంటూ మద్యం, గుట్కా తోపాటు ఇతర చెడు వ్యసనాలకు అలవాటు పడ్డాడు. సుతారి పని మీద వచ్చే ఆదాయం అతడి జల్సాలకు సరిపోకపోవడంతో దొంగతనం చేసి ఆ డబ్బులతో జల్సాలు చేయాలనుకున్నాడు. ఈ క్రమంలో నిడమనూరు మండలంలోని ముకుందాపురం గ్రామానికి చెందిన షేక్ ఉస్మాన్ అతడి కుటుంబ సభ్యులతో కలిసి పీర్ల పండుగ కోసం రుద్రారంలో ఉన్న తన బంధువుల ఇంటికి జూలై 17న వెళ్లాడు. నిందితుడు షేక్ అబ్దుల్ నబి తన చిన్నమ్మ కొడుకు రియాజ్‌తో కలిసి పీర్ల పండుగ కోసం తన పెద్దమ్మ ఊరు అయిన రుద్రారం వెళ్లగా అక్కడే షేక్ ఉస్మాన్ తన కుటుంబ సభ్యులతో కలిసి ఉండడాన్ని షేక్ అబ్దుల్ నబి గమనించాడు. దొంగతనం చేయడానికి ఇదే సరైన సమయమని భావించి యమహా బైక్‌పై జూలై 17 రాత్రి 11 సమయంలో ముకుందాపురం గ్రామంలోని షేక్ ఉస్మాన్ ఇంటి వచ్చాడు. గడ్డపారతో ఇంటి తాళాలు పగులగొట్టి బెడ్ రూం సెల్ఫ్‌లో చీరల మధ్య దాచిన తాళంతో బీరువా తెరిచాడు. లాకర్‌లో దాచిన నగదు రూ.73,000, 12 తులాల బంగారు ఆభరణాలు, 15 తులాల వెండి కాళ్ల పట్టీలను అపహరించి బైక్‌పై అదే అర్ధరాత్రి ఎవరికీ అనుమానం రాకుండా రుద్రారం చేరుకున్నాడు. మరుసటి రోజు బంధువులందరినీ కలిసి పీర్ల పండుగలో పాల్గొని హైదరాబాద్‌కు వెళ్లిపోయాడు. దొంగిలించిన నగదు రూ.73,000 జల్సాలకు వాడుకున్నాడు. రెండు తులాల నల్లపూసల బంగారు గొలుసు, ఒక జత బంగారు చెవి బుట్టలు, మూడు చిన్న బంగారు ఉంగరాలను హైదరాబాద్‌లోని బస్టాండ్‌లో గుర్తు తెలియని వ్యక్తికి అమ్మి వచ్చిన డబ్బులతో జల్సాలు చేశాడు. నగదు అయిపోవడంతో షేక్ అబ్దుల్ నబి మిగిలిన బంగారాన్ని హైదరాబాద్‌లో అమ్మడానికి ప్రయత్నించగా ఎవరూ కొనలేదు. దీంతో మిర్యాలగూడలో ఎవరికైనా అమ్ముకుందామని ఈ నెల 12న (గురువారం) తెల్లవారుజామున యమహా బైక్‌పై ముకుందాపురం మీదుగా మిర్యాలగూడ వైపు వెళ్తున్నాడు. సీఐ జనార్దన్‌గౌడ్, నిడమనూరు ఎస్ఐ గోపాల్‌రావు ఆధ్వర్యంలో నిడమనూరు సమీపంలో పోలీసులు వాహనాలను తనిఖీ చేస్తుండగా షేక్ అబ్దుల్ నబి వాహనంలో బంగారు ఆభరణాలను గుర్తించారు. అనంతరం నిందితుడిని విచారించగా నేరం ఒప్పుకున్నాడు. ఈ కేసును ఛేదించిన హాలియా సీఐ జనార్దన్‌గౌడ్, నిడమనూరు ఎస్ఐ గోపాల్‌రావు, సీసీఎస్ సీఐ జితేందర్‌రెడ్డి, సీసీఎస్ సిబ్బంది విష్ణువర్ధన్, గిరి, పుష్పగిరి, వాహిద్ పాషా, ఇమ్రాన్, ఐడీ పార్టీ సిబ్బంది శ్రవణ్, శేఖర్‌లను డీఎస్పీ అభినందించారు. సమావేశంలో హాలియా ఎస్ఐ సతీష్‌రెడ్డి, పోలీసులు ఉన్నారు.

ఉమ్మడి జిల్లాలో కమ్యూనిస్టు ఉద్యమంపై ఏచూరి ముద్ర


భువనగిరిలో అంబేద్కర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న సీతారాం ఏచూరి (ఫైల్)


గడియారం సెంటర్‌లో వెంకటనర్సింహారెడ్డి సంస్మరణ సభలో మాట్లాడుతున్న ఏచూరి (ఫైల్)

- ప్రతి పోరాటంలోనూ భాగస్వామ్యం
- ప్రజల్లో చైతన్యం నింపేలా ఉత్తేజ పూరిత ప్రసంగాలు ఆయన సొంతం

నల్లగొండ టౌన్, సూర్యాపేట : ఉమ్మడి నల్లగొండ జిల్లాలో కమ్యూనిస్టు ఉద్యమంపై సీపీఎం జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరికి చెరగని ముద్ర వేశారు. పార్టీలో జిల్లాలో నిర్వహించిన ప్రతి ఉద్యమంలోనూ ఆయన భాగస్వాములయ్యారు. పార్టీ పొలిట్‌బ్యూరో సభ్యుడిగా తొలిసారి 1994లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో పార్టీ అభ్యర్థుల గెలుపునకు కృషి చేశారు. ఆ ఎన్నికల్లో తుంగతుర్తి నుంచి సీపీఎం అభ్యర్థిగా పోటీ చేసిన వర్దెల్లి బుచ్చిరాములు విజయాన్ని కాంక్షిస్తూ నూతనకల్‌లో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో పాల్గొన్నారు. అప్పట్లో నియోజకవర్గ వ్యాప్తంగా ఎడ్లబండ్ల ప్రభలతో పార్టీ కార్యకర్తలు తరలివచ్చిన దృశ్యాన్ని చూసిన ఏచూరి చాలా ఉత్తేజపూరితమైన ఉపన్యాసం చేశారు. 1997 నవంబరు 1 నుంచి 3వ తేదీ వరకు నల్లగొండలో జరిగిన పార్టీ రాష్ట్ర మహాసభల్లో అప్పటి కేరళ ముఖ్యమంత్రి ఇ.కె.నయనార్, అప్పటి జాతీయ కార్యదర్శి హరికిషన్ సింగ్‌సుర్జిత్‌తో కలిసి పాల్గొన్నారు. 1998లో మాజీ ఎమ్మెల్యే అరిబండి లక్ష్మీనారాయణ మృతి చెందినప్పుడు నేరేడుచర్లకు వచ్చి నివాళి అర్పించారు. 2004లో జిల్లా కేంద్రంలోని ఎన్జీ కాలేజీ మైదానంలో జరిగిన సమరభేరి సభలో అప్పటి బెంగాల్ ముఖ్యమంత్రి బుద్ధదేవ్ భట్టాచార్యతో కలిసి ప్రసంగించారు. 2004, 2009 ఎన్నికల్లో జిల్లాలో జరిగిన ప్రచార కార్యక్రమంలో పాల్గొన్నారు. సీతారాం ఏచూరి పాల్గొన్న ప్రతిసభలోనూ తెలుగులో అనర్గళంగా మాట్లాడి ప్రజలను ఆకట్టుకునేవారు. స్థానిక సమస్యలతో పాటు జిల్లా, రాష్ట్ర, దేశ ప్రజలు ఎదుర్కొంటున్న వివిధ అంశాలను ప్రస్తావించేవారు. జిల్లాలో సాగిన సాగునీటి పోరాటంలో ఆయన ప్రసంగం రైతులను ఆకట్టుకుంది. ప్రైవేట్ రంగం రిజర్వేషన్లను అమలు చేయాలని, బీసీ సబ్ ప్లాన్ అమలు చేయాలని నల్లగొండలో 2015 డిసెంబరు 2న నిర్వహించిన సభలో జాతీయ కార్యదర్శి హోదాలో పాల్గొన్నారు. అదే సంవత్సరం మల్లు వెంకట నర్సింహారెడ్డి విజ్ఞాన కేంద్రాన్ని ఆయన.. మల్లు స్వరాజ్యంతో కలిసి ప్రారంభించారు. 2019లో నల్లగొండలో జరిగిన తెలంగాణ రాష్ట్ర మహాసభలకు హాజరై నాలుగు రోజుల పాటు జిల్లా కేంద్రంలో బస చేశారు. అదేవిధంగా 2022 సెప్టెంబర్ 17న సాయుధ పోరాట వారోత్సవాల సందర్భంగా అర్వపల్లిలో కామ్రేడ్ మల్లు స్వరాజ్యం స్మారక భవనానికి శంకుస్థాపన చేశారు. 2023 మార్చిలో సూర్యాపేటలో జరిగిన మలు స్వరాజ్యం ప్రథమ వర్ధంతి సభలో పాల్గొన్నారు. తెలంగాణలో సాయుధ పోరాటంలో పాల్గొన్న నాయకులైన భీమిరెడ్డి నరసింహారెడ్డి, మల్లు స్వరాజ్యం లాంటి నాయకుల పట్ల ఆయనకు అమితమైన గౌరవం ఉండేది. ఆయన పోరాటాన్ని స్ఫూర్తిగా తీసుకుని జిల్లాలోనే అనేక మంది కమ్యూనిస్టు నాయకులుగా ఎదిగారు.

మసాల దోశ అంటే ఇష్టం

భువనగిరి టౌన్ : సీపీఎం జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరికి మసాల దోశ అంటే ఇష్టం. ఆయన భువనగిరి మీదుగా ఖమ్మం, వరంగల్ వెళ్తున్న సమయంలో భువనగిరిబైపాస్ రోడ్డులో ఉన్న వివేరా హోటల్‌లో కొద్దిసేపు ఆగి మసాల దోశ తిన్నారు. దాంతోపాటు పొంగల్ కూడా తిన్నారు. ఆ సమయంలో భువనగిరి ఖిలా విశిష్టతను అడిగి తెలుసుకున్నారు.


మిర్యాలగూడలో జూలకంటి రంగారెడ్డి గెలుపు కోసం ప్రచారం చేస్తున్న సీతారాం ఏచూరి (ఫైల్)


సూర్యాపేట గాంధీపార్కులో మల్లు స్వరాజ్యం సంస్మరణ సభలో మాట్లాడుతున్న ఏచూరి(ఫైల్)

పోగొట్టుకున్న సెల్‌ఫోన్లు అప్పగింత


మోత్కూరు : ఫోన్ అందిస్తున్న ఎస్ఐ నాగరాజు

మోత్కూరు : మున్సిపల్ కేంద్రానికి చెందిన ఎదుళ్ల సుధీర్‌రెడ్డి, మోత్కూరు మండలంలోని దాచారం గ్రామానికి చెందిన సూరారం నర్సయ్య ఇటీవల తమ మొబైల్ ఫోన్లు పోగొట్టుకోవడంతో స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. సీఈఐఆర్ సిస్టమ్ ద్వారా పోలీసులు శోధించి బాధితులు పోగొట్టుకున్న సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. గురువారం బాధితులకు స్థానిక ఎస్ఐ డి.నాగరాజు సెల్‌ఫోన్లను స్వయంగా అందజేశారు. ఎవరైనా స్మార్ట్ ఫోన్లను పోగొట్టుకున్నట్లయితే తమకు ఫిర్యాదు చేయాలని ఎస్ఐ సూచించారు.

మఠంపల్లి: నెల రోజుల క్రితం ఓ వ్యక్తి పోగొట్టుకున్న సెల్‌ఫోన్‌ను గురువారం ఎస్ఐ రామాంజనేయులు స్థానిక పోలీస్‌స్టేషన్‌లో అందజేశారు. ఎస్ఐ తెలిపిన వివరాల ప్రకారం.. మఠంపల్లి మండలం చౌటపల్లికి చెందిన నాగరాజు అనే వ్యక్తి బక్కమంతులగూడెం వద్ద సెల్‌ఫోన్ పోవడంతో స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేశాడు. సీఈఐఆర్ సిస్టమ్ ద్వారా శోధించగా మేళ్లచెరువులో సెల్‌ఫోన్ దొరికింది. దీంతో బాధిత కుటుంబ సభ్యురాలికి సెల్ అందజేశామని ఎస్ఐ తెలిపారు.

ఉరివేసుకుని వ్యక్తి ఆత్మహత్య


మల్లేష్ (ఫైల్)

నేరేడుచర్ల : ఉరి వేసుకుని ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన గురువారం నేరేడుచర్లలో చోటుచేసుకుంది. నేరేడుచర్ల ఎస్ఐ రవీందర్ తెలిపిన వివరాల ప్రకారం.. నేరేడుచర్లకు చెందిన మల్లెబోయిన మల్లేష్(42) ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కు చీరతో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మల్లేష్ మృతికి ఆర్థిక ఇబ్బందులే కారణమని అతడి భార్య రజిత పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొంది. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. మల్లేష్ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం హుజూర్‌నగర్ ఆస్పత్రికి తరలించారు. మృతుడికి ఒక కుమారుడు, కుమార్తె ఉన్నారు.

నిషేధిత గుట్కాలు పట్టివేత

వలిగొండ : నిషేధిత గుట్కా ప్యాకెట్లను అమ్ముతున్న వ్యక్తి ఇంటిపై భువనగిరి ఎస్ఓటీ పోలీసులు, స్థానిక పోలీసులతో కలిసి దాడి చేసి పట్టుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. వలిగొండ మండల కేంద్రానికి చెందిన మురారిశెట్టి కుమార్ నిషేధిత గుట్కాలను అమ్ముతున్నట్లు పోలీసులకు సమాచారం అందింది. పోలీసులు అతడి ఇంటిపై దాడిచేసి రూ.44,770 విలువ గల గుట్కా ప్యాకెట్లను పట్టుకుని సీజ్ చేసి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ యుగంధర్ తెలిపారు.

కిడ్నాప్ అయిన వ్యక్తిని రక్షించిన పోలీసులు

నల్లగొండ క్రైం: కిడ్నాప్ అయిన వ్యక్తిని పోలీసులు రక్షించిన ఘటన గురువారం చోటుచేసుకుంది పోలీసుల తెలిపిన వివరాల ప్రకారం.. నల్లగొండలోని మదీనా కాలనీకి చెందిన కొలిల్కర్ మణిదీప్‌ను కొందరు వ్యక్తులు కిడ్నాప్ చేశారని నల్లగొండ టూ టౌన్ పోలీసు స్టేషన్‌లో బుధవారం కుటుంబ సభ్యులు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు ప్రారంభించి ప్రత్యేక టీమ్‌లుగా ఏర్పడి గురువారం మొహినాబాద్ ప్రాంతంలో ఛేదించారు. పోలీసులు తెలిపిన ప్రకారం.. మదీనా కాలనీకి చెందిన కొలిల్కర్ మణిదీప్‌కు మొయినాబాద్‌కు చెందిన మంజులకు 13 సంవత్సరాల క్రితం పెళ్లయింది. వీరికి ఇద్దరు పిల్లలు. వీరి మధ్య విభేదాలు రావడంతో 8 నెలల క్రితం మణిదీప్ తన భార్యతో విడాకులు తీసుకున్నాడు. అది మనసులో పెట్టుకున్న ఆయన భార్య, తన తమ్ముడు సందీప్ మరో నలుగురు కలిసి కారులో నల్లగొండలో మదీనా కాలనీలో ఉన్న మణిదీప్ ఇంటికి వచ్చింది. మణిదీప్‌ను, వాళ్ల అమ్మ లలితను కొట్టి, మణిదీప్‌ను కారులో ఎక్కించుకుని మొయినాబాద్ వైపు వెళ్లారు. ఈ విషయాన్ని మణిదీప్ అమ్మ లలిత టూ టౌన్ పోలీస్‌లకు వెంటనే తెలిపింది. ఎస్ఐ నాగరాజు, తన సిబ్బందితో కలిసి లొకేషన్ ఆధారంగా కిడ్నాప్ అయిన మణిదీప్‌ను మొయినాబాద్ మండలం, పెద్ద మంగళం గ్రామంలో రక్షించి, ఆయన మాజీ భార్య మంజుల, తమ్ముడు సందీప్‌లను పట్టుకున్నారు. మిగతా వారు పోలీసులను చూసి పారిపోయారు. ఈ కేసును ఒక రోజులో ఛేదించిన నల్లగొండ డీఎస్పీ కె.శివరాంరెడ్డి, సీఐ డానియల్, టూ టౌన్ ఎస్ఐ నాగరాజు, పీసీ నాగరాజులను ఎస్పీ శరత్‌చంద్ర పవార్ అభినందించారు.

నీటి కుంటలో పడి రెండు ఎద్దులు మృతి

గుండాల : ప్రమాదవశాత్తు నీటి కుంటలో మునిగి రెండు ఎద్దులు మృతి చెందాయి. ఈ సంఘటన గుండాల మండలంలోని సీతారాంపురం గ్రామంలో గురువారం జరిగింది. గ్రామస్తులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన చేగూరి పాండు తన ఎద్దులతో చెల్కలో గుంటుకతోలి మెడలపై అరక వేసుకుని ఇంటికి వస్తున్నాడు. ఈ క్రమంలో రోడ్డుపై వెళ్తున్న వాహనాల శబ్దాన్ని విని ఎద్దులు ఒక్కసారిగా బెదిరిపోయి పరుగెత్తుకుంటూ వెళ్లి నీటి గుంటలో పడి మునిగాయి. మెడకు ఉన్న తాళ్లు గట్టిపడి ఊపిరాడక రెండు ఎద్దులు మృతి చెందాయి. మృతి చెందిన ఎద్దుల విలువ సుమారు లక్షన్నర రూపాయలు ఉంటుందని బాధిత రైతు విలపిస్తూ తెలిపాడు.

సాగర్ ఎడమ కాల్వలో పడి విద్యార్థి మృతి


ప్రభాస్

త్రిపురారం : ప్రమాదవశాత్తు సాగర్ ఎడమ కాల్వలో పడి ఓ విద్యార్థి మృతి చెందాడు. ఈ సంఘటన నిడమనూరు మండలంలోని వేంపాడు గ్రామ పంచాయతీ పరిధిలో గురువారం చోటుచేసుకుంది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. వేంపాడు గ్రామానికి చెందిన గుడపూరి ప్రభాస్(17) హాలియాలోని కృష్ణవేణి టాలెంట్ స్కూల్‌లో పదో తరగతి చదువుతున్నాడు. తల్లిదండ్రులు వేంపాడు స్టేజీ వద్ద కిరాణం డబ్బా నిర్వహిస్తున్నారు. ఇంటి వద్ద మేకలను చూసి రమ్మని తల్లి చెప్పడంతో ప్రభాస్ స్కూటీపై వెళ్లాడు. ఎంతకు తిరిగి రాకపోవడంతో ఫోన్ చేసినా స్పందించలేదు. తల్లిదండ్రులు అనుమానంతో వెతకడంతో కాల్వ కట్టపై స్కూటీ, చెప్పులు, కళ్లద్దాలు కనిపించాయి. కాలు జారి కాల్వలో పడి ఉంటాడనే అనుమానంతో వారు పోలీసులకు సమాచారం అందించారు. సంఘటనా స్థలం వద్దకు చేరుకున్న పోలీసులు గజ ఈతగాళ్లతో కాల్వలో వెతికించారు. వారు కాల్వలో ప్రభాస్ మృతదేహాన్ని గుర్తించి బయటకు తీశారు. ప్రభాస్ తండ్రి సామేల్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు నిడమనూరు ఎస్ఐ గోపాల్‌రావు తెలిపారు.

స్వర్ణగిరి శ్రీవారికి తిరుప్పావడ సేవ



భువనగిరి : పట్టణ శివారులోని స్వర్ణగిరి శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయంలో గురువారం శ్రీవారికి తిరుప్పావడ సేవ కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా 450 కిలోల అన్నప్రసాదం, లడ్డూ, వడ, పులిహోర, పిండి వంటలను స్వామివారికి నివేదన చేసి అర్చకులు మంగళహారతులు ఇచ్చారు. ముందుగా ఉదయం ఆలయంలో సుప్రభాత సేవ, తోమాల సేవ, సహస్రనామార్చన, నిత్య కళ్యాణంనిర్వహించారు.

అనుమానాస్పద స్థితిలో యువకుడు మృతి


సందీప్ (ఫైల్)

చివ్వెంల(సూర్యాపేట) : అనుమానాస్పద స్థితిలో చెరువులో పడి ఓ యువకుడు మృతి చెందాడు. ఈ సంఘటన చివ్వెంల మండల పరిధిలోని జి.తిర్మలగిరి గ్రామంలో జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన రాచకొండ సందీప్ (24) కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. తల్లిదండ్రులు చిన్నప్పుడే చనిపోవడంతో నాయనమ్మ లక్షమ్మ వద్ద ఉంటున్నాడు. బుధవారం రాత్రి గ్రామంలోని వినాయక విగ్రహం వద్ద అన్నదాన కార్యక్రమం తర్వాత సందీప్ ఇంటికి వెళ్లాడు. అనంతరం ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. గురువారం ఉదయం చెరువులో శవమై తేలియాడడంతో గమనించిన స్థానికులు కుటుంబ సభ్యులకు, పోలీసులకు సమాచారం అందించారు. సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు స్థానికుల సహాయంతో సందీప్ మృతదేహాన్ని బయటకు తీసి పోస్టుమార్టం నిమిత్తం సూర్యాపేట హాస్పిటల్‌కు తరలించారు. మృతుడి బాబాయ్ రాచకొండ వెంకన్న ఫిర్యాదు మేరకు ఏఎస్ఐ జి.వెంకటేశ్వర్లు కేసు నమోదు చేసి, మృతదేహాన్ని పోస్టుమార్టం అనంతరం కుటుంబ సభ్యులకు అప్పగించారు. మృతుడు అవివాహితుడు. సందీప్ మృతిపై దర్యాప్తు చేన్నట్లు ఏఎస్ఐ తెలిపారు.

వేర్వేరు ప్రమాదాల్లో ముగ్గురు దుర్మరణం


మార్కండేయ (ఫైల్)

నల్లగొండక్రైం: వేర్వేరు ప్రమాదాల్లో ముగ్గురు మృతి చెందారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నల్లగొండ పట్టణంలోని హైదరాబాద్ రోడ్డులో గురువారం బైక్‌ను తప్పించబోయి ట్రాలీ ఆటో బోల్తా పడింది. ఆటోలో ప్రయాణిస్తున్న కాసోజు మార్కండేయ(40) తీవ్రంగా గాయపడి ఆస్పత్రిలో చేరేలోగా మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కేశరాజుపల్లికి చెందిన ఆటో డ్రైవర్ మహ్మద్ మసీరుద్దీన్.. మార్కండేయలు కలిసి ఆటోలో ప్రకాశం బజార్‌లో మెడిసిన్ కాటన్ డబ్బాలను లోడ్ చేసుకుని వలిగొండకు వెళ్తున్నారు. హైదరాబాద్ రోడ్డులో మసీదు వద్దకు ఆటో చేరుకోగానే యువకులు బైక్‌పైనుంచి అకస్మాత్తుగా రోడ్డుపై పడ్డారు. వారిని తప్పించబోయి బ్రేక్ వేయడంతో ఆటో అదుపు తప్పి బోల్తా పడింది. దీంతో ఆటోలో ఉన్న మార్కండేయ తలకు బలమైన గాయమైంది. హుటాహుటిన ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లేలోపే మార్కండేయ మృతి చెందాడు. మార్కండేయ కూలి పని చేసుకుని జీవనోపాధి పొందేవాడు. మృతుడు డ్రైవర్‌కు స్నేహితుడు కావడంతో తోడుగా వెళ్లాడు. మార్కండేయ భార్య సుమలత ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు టూటౌన్ ఎస్ఐ నాగరాజు తెలిపారు.

బైక్ అదుపుతప్పి యువకుడు..

మిర్యాలగూడ : ప్రమాదవశాత్తు బైక్ అదుపు తప్పి లారీని వెనుక నుంచి ఢీకొట్టిన సంఘటనలో యువకుడు మృతి చెందాడు. ఈ సంఘటన దామరచర్ల మండలకేంద్రంలో గురువారం చోటుచేసుకుంది. వాడపల్లి ఎస్ఐ రవి తెలిపిన వివరాల ప్రకారం.. దామరచర్ల మండలం వాడపల్లి గ్రామానికి చెందిన చల్లా రవిశంకర్ (35) అనే వ్యక్తి తన బైక్‌పై పని నిమిత్తం దామరచర్ల మండల కేంద్రానికి వచ్చాడు. తిరిగి వాడపల్లికి వెళ్తున్న క్రమంలో నార్కట్‌పల్లి–అద్దంకి రహదారి మూలమలుపు వద్ద రోడ్డు వెంట నిలిపి ఉన్న లారీని వెనుక వైపు నుంచి బలంగా ఢీకొట్టాడు. తీవ్ర గాయాలపాలైన రవిశంకర్ అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడి భార్య మౌనిక ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మిర్యాలగూడ ఏరియా ఆస్పత్రికి తరలించారు. మృతుడికి ఇద్దరు పిల్లలు ఉన్నారు.

రెండు లారీల మధ్య ఇరుక్కుని..

మేళ్లచెరువు : ప్రమాదవశాత్తు రెండు లారీల మధ్య ఇరుక్కుని డ్రైవర్ మృతి చెందిన సంఘటన గురువారం తెల్లవారుజామున మేళ్లచెరువు మండల పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నల్లగొండ జిల్లా మర్రిగూడెం మండలం ఎరగండ్లపల్లి గ్రామానికి చెందిన ఆకారపు మహేష్(25) మూడు సంవత్సరాలుగా సూర్య స్టీల్స్ అండ్ సిమెంట్స్ ట్రాన్స్‌పోర్టులో లారీ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. కాగా మైహోం సిమెంట్ పరిశ్రమలో 11వ తేదీ రాత్రి లారీలో సిమెంట్ లోడింగ్ చేసుకుని లారీ యార్డు వద్ద లారీని కాసేపు నిలిపాడు. అనంతరం రాత్రి ఒంటి గంట సమయంలో లారీ టైర్లు చెక్ చేసుకుని లారీ ఎక్కుతుండగా.. మరొక లారీ డ్రైవర్ లారీని వెనుకకు రానీయడంతో మహేష్ రెండు లారీల మధ్యలో ఇరుక్కున్నాడు. మహేష్‌ను రెండు లారీల మధ్యలోనుంచి బయటకు తీసేసరికి మృతి చెందాడు. మృతురాలి తల్లి అనసూర్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ.పరమేష్ తెలిపారు.


30 క్వింటాళ్ల రేషన్ బియ్యం స్వాధీనం

రామన్నపేట : వేర్వేరు మండలాల్లో పోలీసులు, సివిల్ సప్లయ్ అధికారులు 30 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. దుబ్బాక నుంచి రామన్నపేట వైపు రేషన్ బియ్యం తరలిస్తున్నట్లు సివిల్ సప్లయ్ అధికారులకు విశ్వసనీయ సమాచారం అందింది. దీంతో చౌటుప్పల్ డివిజన్ సివిల్ సప్లయ్ డిప్యూటీ తహసీల్దార్ బొక్క బాలమణి రామన్నపేట శివారులో వాహనాలు తనిఖీ చేస్తుండగా మహీంద్రా సుప్రో వాహనంలో 32 తెల్ల బస్తాల్లో సుమారు 20 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టుబడ్డాయి. జబ్రోతు శ్రీకాంత్, కుంసోడు నాగులు బియ్యాన్ని తరలిస్తున్నట్లు గుర్తించారు. బియ్యంతోపాటు వాహనాన్ని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. డీటీ బాలమణి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ పి.మల్లయ్య తెలిపారు.

పది క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టివేత

చిట్యాల: గ్రామాల్లో రేషన్ బియ్యం కొనుగోలు చేసి రైస్ మిల్లర్స్‌కు విక్రయించేందుకు ప్రయత్నం చేస్తున్న ఇద్దరు యువకులను పట్టుకుని కేసు నమోదు చేసినట్లు చిట్యాల ఎస్ఐ ఎస్.ధర్మా గురువారం తెలిపారు. ఎస్ఐ తెలిపిన వివరాల ప్రకారం.. యాదాద్రి భువనగిరి జిల్లా భువనగిరి మండలం పోచార్లబోడు తండాకు చెందిన ధరావత్ తరుణ్ గ్రామాల్లో లబ్ధిదారుల వద్ద ఏడు క్వింటాళ్ల రేషన్ బియ్యం కొనుగోలు చేశాడు. అదేవిధంగా నల్లగొండ జిల్లా పెద్దవూర మండలం యేనెమీది తండాకు చెందిన రామవత్ శంకర్ వివిధ గ్రామాల్లో మూడు క్వింటాళ్ల రేషన్ బియ్యం కొనుగోలు చేశాడు. రేషన్ బియ్యాన్ని వేర్వేరుగా రెండు ఆటోల్లో రైస్ మిల్లర్స్‌కు విక్రయించేందుకు రవాణా చేస్తుండగా విశ్వసనీయ సమాచారం అందడంతో చిట్యాల మండలంలోని పేరేపల్లి గ్రామ శివారులో పోలీసులు వారిని పట్టుకున్నారు. రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకుని ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ ధర్మా తెలిపారు.

రైతులు సేంద్రియ వ్యవసాయం చేయాలి


పటం ద్వారా వ్యవసాయ స్థితిగతులను అధ్యయనం చేస్తున్న విద్యార్థులు

నేరేడుచర్ల : రైతులు సేంద్రియ వ్యవసాయం చేయాలని మధ్యప్రదేశ్‌లోని మండ్సూర్ వ్యవసాయ విశ్వవిద్యాలయానికి చెందిన బీఎస్సీ అగ్రికల్చర్ విద్యార్థులు అన్నారు. గ్రామీణ కృషి అనుభవ కార్యక్రమంలో భాగంగా మండ్సూర్ వ్యవసాయ విశ్వవిద్యాలయానికి చెందిన బీఎస్సీ అగ్రికల్చర్ విద్యార్థులు నేరేడుచర్ల మండలం దాసారంలో గురువారం రైతులు చేస్తున్న వ్యవసాయ విధానంపై అధ్యయనం చేశారు. గ్రామంలో మౌలిక వసతులు, సదుపాయాలు, రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం విద్యార్థులు మాట్లాడుతూ రైతులు ఎక్కువగా సేంద్రియ వ్యవసాయం వైపు మొగ్గు చూపడం లేదని, రసాయనాల వల్ల భూసారం తగ్గి దిగుబడులు తగ్గుతున్నాయని అన్నారు. గడ్డిపల్లి కృషి విజ్ఞాన కేంద్రం ఉద్యాన శాస్త్రవేత్త సీహెచ్ నరేష్ మాట్లాడుతూ రైతులు ఆయిల్‌పాం, కూరగాయలు, పూల తోటల సాగు చేపట్టి అధిక నికర ఆదాయం పొందవచ్చని తెలిపారు. పంటల మార్పిడి, భూసార పరీక్షల వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు. కార్యక్రమంలో కేవీకే గడ్డిపల్లి ప్రోగ్రాం అసిస్టెంట్ ఆకుల నరేష్, రైతులు రామకృష్ణ, వెంకటేష్, సాంబయ్య, నాగరాజు, వినోద్, గోపాల్, ఎల్లయ్య, సోమయ్య, వ్యవసాయ విద్యార్థులు అజయ్‌గుప్తా, మహేష్, ఈశ్వర్, ఆదినాథ్ తదితరులున్నారు.